తెలుగు వర్సిటీ పేరు మార్చొద్దు

రవిగుప్తా

ఆర్కేపురం, ఆగస్టు 4 : తెలుగు యూనివర్సిటీ పేరు మార్చవద్దని రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు కొత్త రవి అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని ఆర్యవైశ్యులకు స్ఫూర్తిదాయకుడైన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరును తెలుగు యూనివర్సిటీకి మార్చడం తగదన్నారు. అటువంటి ఆర్యవైశ్య జాతి నాయకుడి స్ఫూర్తితో ఏర్పడిన పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరును మార్చుతామని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి తెలిపాడని, అందుకు ఆర్యవైశ్యుల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. నిర్ణయాన్ని వెంటనే వెనుకకు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సురవరం ప్రతాప్‌రెడ్డి పేరును ఒక యూనివర్సిటీకి పెట్టాలి అని అనుకుంటే నిజామాబాద్ జిల్లాలో ఉన్నటువంటి తెలంగాణ యూనివర్సిటీకి పెట్టవలసిందిగా సూచిస్తునట్లుగా తెలిపారు.

బోనాలకు ముస్తాబైన పోచమ్మ ఆలయం

చంపాపేట, ఆగస్టు 4: చంపాపేట డివిజన్ పరిధి కర్మన్‌ఘాట్ క్రాంతినగర్ కాలనీ క్రాంతి క్లబ్ ఆవరణలోని పోచమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ దివంగత ఎరుకల కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో గత సంవత్సరం నూతనంగా పోచమ్మ అమ్మవారి ఆలయం నిర్మించేందుకు కమిటీ సభ్యులందరి సమష్టి నిర్ణయంతో పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో దురదృష్ట వశాత్తు ఆలయ కమిటీ చైర్మన్ ఎరుకల కృష్ణగౌడ్ అనారోగ్యానికి గురై మృతి చెందాడు. ఈ కారణంగా ఆలయ నిర్మాణాలు కొంతకాలం అర్ధాంతరంగా నిలిచి పోయాయి. ఇలా కొంతకాలానికి కృష్ణగౌడ్ కుమారుడు విశ్వనాథ్‌గౌడ్ తన తండ్రి స్థానమైన పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ స్థానంలో నిలిచి తన తండ్రి కృష్ణ గౌడ్ పేరు, ప్రతిష్ఠలను ఎలాగైనా నిలబెట్టాలన్న దృఢ సంకల్పంతో ముందుకొచ్చి నిలిచి పోయిన పోచమ్మ ఆలయ నిర్మాణాలను కమిటీ సభ్యులందరి చేయూతతో పూర్తిచేసి తండ్రికితగ్గ కొడుకు అనిపించుకున్నాడు.

బోనాల జాతర...

నూతనంగా నిర్మాణాలు పూర్తయిన పోచమ్మ ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఈ నెల 6నుంచి మొదలుకుని 7 రోజులు కొనసాగించనున్నట్లు విశ్వనాథ్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా వేదపండింతుల మంత్రోచ్ఛరణలతో పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయం ముందు ధ్వజస్తంభం ప్రతిష్ఠ, వైభవంగా బోనాల జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు చైర్మన్ విశ్వనాథ్‌గౌడ్ తెలిపారు.

సంస్కృతికి ప్రతీక బోనాలు

మన్సూరాబాద్, ఆగస్టు 4: మన్సూరాబాద్, నాగోల్ డివిజన్ల పరిధిలో బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మన్సూరాబాద్, నాగోల్ డివిజన్ల పరిధిలోని అమ్మవార్ల దేవాలయాలను ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త, నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి తదితరులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంస్కృతికి ప్రతీక బోనాలు అన్నారు. అమ్మవార్లను దర్శించుకున్న వారిలో రంగారెడ్డి జిల్లా అర్బన్ బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, డివిజన్ టీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు రుద్ర యాదగిరి, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రి వెంకన్న కురుమ, టీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు, పోచబోయిన గణేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

నాగోల్‌లోని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

పూజలు నిర్వహించిన మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యుడు పండుగ కరుణాకర్

నాగోల్‌లో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్న రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలి

సాయిలుకు చెక్కును అందజేస్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట,ఆగస్టు4: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అంజిరెడ్డి కాలనీలో నివాసం ఉండే సాయిల్‌కు రెండు లక్షల ఎల్‌వోసీ చెక్కును బాధితుడికి అందజేశారు. ప్రభుత్వం కష్టాలలో ఉన్న ప్రజలను ఆదుకోవలసిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ప్రజల మెప్పు పొందే పాలన అందించాలన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవలసిన అవసరం ఉందన్నారు. గతంలో అనేక మందికి ప్రభుత్వం నుంచి సహకారం అందించామని తెలిపారు. పార్టీలకు అతీతంగా పనిచేయడం జరిగిందన్నారు. అపదలో ఉన్న వారు ఎవరైనా సరే ఆదుకున్నామని తెలిపారు. బాధ్యతగా పనిచేయాలన్నారు. ప్రజలను విస్మరించిన వారికి ప్రజలు సరైన సమయంలో గుణపాఠం చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, రాజు, రఘునందన చారి, అత్తాపూర్ శ్రీనివాస్ రెడ్డి, అరవింద్ గౌడ్ తదితరులు ఉన్నారు.

చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే ఉపేక్షించం

వనస్థలిపురం, ఆగస్టు 4 : పగలు, రాత్రి తేడా లేకుండా విచక్షణరహితంగా కస్టమర్లను మద్యం సేవించడానికి, గదులలో ఉండడానికి అనుమతిస్తూ ఎలాంటి ధ్రువ పత్రాలు లేకుండా హోటల్ గదులలో ఉండడానికి అనుమతిస్తూ చట్ట వ్యతిరేక చర్యలను ప్రోత్సహిస్తున్న శ్రీరస్తు బార్, రెస్టారెంట్, హోటల్ ప్రాంగణాన్ని (బొమ్మరిల్లు) సీపీ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు ఎస్‌హెచ్‌ఓ వనస్థలిపురం విజ్ఞప్తి మేరకు సబ్-డివిజనల్ మేజిస్ట్రేట్ కందుకూర్ రంగారెడ్డి మూసివేశారు. సుధీర్ బాబు మాట్లాడుతూ సాధారణ ప్రజలకు అసౌకర్యం కలిగించే విధంగా వ్యవహరించే వారిని, అసాంఘిక కార్యకలాపాలు కొనసాగించే వారిని, ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించమని హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు, సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామని కమిషనర్ తెలిపారు.

పద్మశాలీల అభివృద్ధికి కృషిచేస్తా

పద్మశాలి సంఘం ప్రతినిధులను కలిసి మద్దతు కోరుతున్న అధ్యక్ష అభ్యర్థి మల్లేశం

కాప్రా, ఆగస్టు 4: ఈనెల 18న జరిగే తెలంగాణ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల్లో తనకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర పద్మశాలి సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా పోటీ చేస్తున్న బూర మల్లేశం కోరారు. ఆదివారం మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ పద్మశాలి సంఘం ప్రతినిధులను కలిసి అధ్యక్ష ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలువాలని మల్లేశం అభ్యర్థించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ తాను గెలిస్తే రాష్ట్రంలో పద్మశాలీల ఐక్య తకు,అభివృద్ధికోసం కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో హెచ్‌బీకాలనీ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీహరి, ఉపాధ్యక్షులు అంజయ్య, కోశాధికారి సతీష్ ,లక్ష్మీనారాయణ, అడ్వైజర్లు శ్రీపతి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ అభివృద్ధిలో..పట్టభద్రుల సేవలే కీలకం

జవహర్‌నగర్, ఆగస్టు 4: ప్రపంచాభివృద్ధిలో పట్టభద్రుల సేవలే కీలకమవ్వాలని, యువతరం బలమైన నమ్మకంతో... భవిష్యత్తుకు పునాదులెయ్యాలని, తెలంగాణ నుంచే ప్రపంచ దేశాలకు కొత్త టెక్నాలజీని అందజేయాలని పట్టాభద్రులైన యువతరానికి బఫెలో యూనివర్సిటీ అధ్యక్షుడు, ప్రెఫెసర్ సతీష్ కె. త్రిపాఠి న్యూయార్క్ పిలుపునిచ్చారు.జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని బిట్స్ ఫిలా నీ క్యాంపస్‌లో ఆదివారం స్నాతకోత్సవాన్ని పురస్కరించుకొని పండుగ వాతావరణంలో గ్రాడ్యూయేషన్ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బఫెలో యూనివర్సిటీ అధ్యక్షుడు, ప్రెఫెసర్ సతీష్ కె.త్రిపాఠి న్యూయార్క్,బిట్స్ ఫిలా నీ ఉపకులపతి, ప్రొఫెసర్ రాంగోపాల్‌రావు హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీ ష్ కె. త్రిపాఠి మాట్లాడుతూ టెక్నాలిజీతోనే మానవ మనుగడ ముడిపడి ఉందనీ, విద్యార్థులు ఎన్నో సవాళ్లను ఎదుర్కొని భవిష్యత్తును నిర్దేశించుకోవాలని అన్నారు. బిట్స్ ఫిలానీలో విద్యనభ్యసించిన విద్యార్థులు దేశ, విదేశాల్లో ఉన్నత పదవుల్లో కొనసాగుతున్నారని బిట్స్ ఫిలానీ ఉప కులపతి ప్రొఫెసర్ రాంగోపాల్‌రావు అన్నారు. ఈ స్నాతకోత్సవంలో డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన 1600 మంది విద్యార్థులు పట్టాలను అందజేశారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన మొదటి డిగ్రీ విద్యార్థి సర్దేశాయ్‌కు బంగారు పథకం, బిట్స్ పూర్వ విద్యార్థు లు 1976 బ్యాచ్‌కు చెందిన శ్రీప్రతుల్ ష్రాఫ్, 1961 బ్యాచ్‌కు చెందిన రన్‌వీన్ టెహ్రాన్‌లకు బిట్స్ రత్నా అవార్డులు అందజేశారు. అనంతరం పట్టా లు పొందిన విద్యార్థులు వారి తల్లిదండ్రులతో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో బిట్స్ ఫిలానీ డైరెక్టర్ సౌమ్య ముఖర్జీ, బిట్స్ ఫిలానీ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బిట్స్ ఫిలానీ స్నాతకోత్సవం వేడుకల్లో పాల్గొన్న బఫెలో యూనివర్సిటీ అధ్యక్షుడు, ప్రొఫెసర్ సతీష్ త్రిపాఠి న్యూయార్క్, ప్రముఖులు

ఆరు గ్యారంటీలతో మోసం చేసిన కాంగ్రెస్

సమావేశంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రశేఖర్

మలక్‌పేట, ఆగస్టు 4: వందరోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని వాగ్దానం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్లు దండుకొని మోసం చేసిందని బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మూసారాంబాగ్ ఎస్‌బీఐ కాలనీలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ కమ్యూనిటీ హాల్‌లో భాగ్యనగర జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన భాగ్యనగర జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ప్రజల సమస్యలు పరిష్కరించటంకన్నా కుర్చీని కాపాడుకోవటమే ముఖ్యమైన పనిగా మారిందన్నారు. రాష్ట్రంలో పాలనను పక్కకు పెట్టి కాంగ్రెస్ అధిష్టానాన్ని ప్రసన్నం చేసుకునేందుకు ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని అన్నారు. అంతర్గత పోరులో పైచేయి సాధించాలన్న ప్రభుత్వ పెద్దల తాపత్రయం కారణంగా పాలన పూర్తిగా పడకేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ఫలితంగా అనేక నేరాలు జరుగుతున్నాయని భాగ్యనగర జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. భూకబ్జాలు, చెరువుల ఆక్రమణకు పాల్పడుతున్న ఎంఐఎం ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా శాఖ డిమాండ్ చేస్తుందన్నారు. గుడి మల్కాపూర్, మిరాలమండీ, మాదన్నపేట మార్కెట్లను అభివృద్ధి పరచాలని, చారిత్రాత్మకమైన చిత్రగుప్త దేవాలయం, కేశవస్వామి దేవాలయం, అక్కన్న, మాదన్న దేవాలయం, లాల్ దర్వాజ సింహవాహిని దేవాలయం, ఆస్మాన్ ఘడ్ వేంకటేశ్వరస్వామి దేవాలయం, కరన్ బాగ్ మల్లికార్జునస్వామి దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి పరచాలని జిల్లా కార్యవర్గం కోరుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు వాటికి అనుబంధంగా ప్రకటించిన 66 వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని జిల్లా కార్యవర్గం డిమాండ్ చేస్తుందని భాగ్యనగర జిల్లా ప్రధాన కార్యదర్శి సందడి సురేందర్‌రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుభాశ్ చందర్‌జీ, ప్రధాన కార్యదర్శులు మహేందర్, శేఖర్, కార్పొరేటర్లు అరుణ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి, బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, శ్వేత, భాగ్యలక్ష్మి, ఉపాధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, రూప్‌రాజ్, నిరంజన్‌యాదవ్, కన్వీనర్లు గజానంద్, బండ వెంకట్‌రెడ్డి, పండరీనాథ్, బొక్క మధుసూదన్‌రెడ్డి, లింగాలి హరి పాల్గొన్నారు.

అన్నదానంతోనే ఆత్మ సంతృప్తి

చంపాపేట, ఆగస్టు 4: అన్నదానం చేస్తే ప్రతి ఒక్కరికి ఎంతో ఆత్మ సంతృప్తి కలుగుతుందని మాత అన్నపూర్ణేశ్వరి అన్నదాన కమిటీ చైర్మన్ భగవాన్‌జీ అన్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో గతేడాది నుంచి ప్రతి అమావాస్య రోజున అన్న ప్రసాద వితరణ చేపడుతూ...ఆకలితో అలమటించే వారికి అన్నదాతలుగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం అమావాస్య సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో చంపాపేట నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ ఆలయం ఎదురుగా ఉండే పౌర సరఫరాల దుకాణం ముందు సుమారు 600 వందల మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో అన్నపూర్ణేశ్వరి కమిటీ సభ్యులు బీఆర్ఎస్ ఎల్బీనగర్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్, కమిటీ సభ్యులు సంతోష్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, హరిలాల్, సుశీల్‌కుమార్, సంతోష్‌లడ్డా, ప్రవీణ్, వెంకటేశ్, చింటు, రాజు, శాన్వాస్, అండేకర్ వెంకటేశ్, శ్రీనివాస్, రాజేశ్‌టింగ్‌లికర్, కర్నాటి మనోహర్ నేత, కర్నాటి సాయిరమేశ్ ముదిరాజ్, శ్రీనునాయక్, చందు, రాదేకుమార్, తదితరులు పాల్గొన్నారు.

చంపాపేట పోచమ్మ ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న అన్నపూర్ణేశ్వరి అన్నదాన కమిటీ

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

ఆర్కేపురం: అమావాస్య సందర్భంగా ఆదివారం ఆర్కేపురం డివిజన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తాడేపల్లి వెంకటేశంగుప్తా, ఆర్కేపురం డివిజన్ అధ్యక్షులు పొద్దుటూరి శ్రీనివాస్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి నాగేంద్రయ్యగుప్తా, శుభకర్, జగిని రమేశ్, లక్ష్మీ సుబ్రహ్మణ్యం, శ్రావణ్‌కుమార్, ఆరవేటి వేణుమాధవ్, ఉప్పల బాల శ్యామ్ తదితరులు ఉన్నారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ..

మలక్‌పేట: అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం హైదరాబాద్-రంగారెడ్డి జిల్లాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దిల్‌సుఖ్‌నగర్‌లోని అసోసియేషన్ కార్యాలయం వద్ద 500 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము సంపాదిస్తున్న సంపాదనలో కొంతనైనా పేదలకు దానం చేయాలన్న సదుద్దేశంతో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా ప్రతి నెలా అమావాస్య రోజున అన్నదానం నిర్వహించి పేదల ఆకలి తీర్చటం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్-రంగారెడ్డి జిల్లాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు పొద్దటూరి రవీందర్, ఉపాధ్యక్షుడు తోట వెంకయ్య, ప్రధాన కార్యదర్శి రాముని రామనాథం, సభ్యుడు పాల మధుసూదన్, నాగభూషణం, ఆమేటి శ్రీనివాస్, వెంకటయ్యతోపాటు సభ్యులు, రామారావు, రవి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న చిలుక ఉపేందర్‌రెడ్డి

అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న చైర్మన్ అమరవాది లక్ష్మీనారాయణ, సభ్యులు

నేటి నుంచి స్వచ్ఛదనం-పచ్చదనం

మలక్‌పేట, ఆగస్టు 4: మలక్‌పేట నియోజకవర్గంలో సర్కిల్-6 పరిధిలో సోమవారం నుంచి ఈ నెల 9 వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డీసీ జయంత్ ఒక ప్రకటనలో తెలిపారు. 5న పరిశుభ్రతకు సంబంధించి రహదారులు, కాలనీల్లో వ్యర్థాలు, చెత్త ,చెదారం, డెబ్రిస్ తొలగింపు పనులు చేపట్టనున్నామని, 6న ఆరోగ్యానికి సంబంధించి ఈగల, దోమల నివారణకు ఫాగింగ్, లార్వా నిర్మూలన రసాయనాల పిచికారి, 7న నీటి వనరులు, సరస్సుల వెంట వ్యర్థాల తొలగింపు, 8న కాలువలు, డ్రైనేజీలు, నాలాల్లో పూడికతీత, వ్యర్థాల తొలగింపు, 9న వన మహోత్సవం, పార్కులు, ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఇంటికి ఆరు మొక్కల పంపిణీ, ఉద్యానవన సంక్షేమ కమిటీల ఏర్పాటు, పార్కుల్లో వ్యర్థాల తొలగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జయంత్ తెలిపారు.

డిగ్రీ కోర్సుల ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 4: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని డిగ్రీ కోర్సుల వన్‌టైం చాన్స్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

పీజీ డిప్లామా ఇన్ కలినరీ ఆర్ట్స్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లామా ఇన్ కలినరీ ఆర్ట్స్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 7 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

యువకుడు అదృశ్యం

వివేక్ (ఫైల్)

మన్సూరాబాద్, ఆగస్టు 4: స్నేహితులను కలిసేందుకంటూ ఇంటి నుంచి బయలుదేరి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నాగోల్, శ్రీసాయినగర్‌కాలనీకి చెందిన మాలతి కుమారుడు కైరంకొండ వివేక్ షేర్ మార్కెట్ ట్రేడింగ్ చేస్తుంటాడు. ఈనెల 2న రాత్రి 8 గంటల సమయంలో స్నేహితులను కలిసేందుకంటూ ఇంటి నుంచి బయలుదేరి వెళ్లిన వివేక్ ఎంతకీ తిరిగి రాలేదు. వివేక్ ఆచూకీ కోసం స్నేహితులు, బంధువుల ఇండ్లలో వెతికినా జాడ తెలియరాలేదు. తల్లి మాలతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాగోల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా బోనాలు

రామంతాపూర్,ఆగస్టు 4: ఉప్పల్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. చిలుకానగర్ డివిజన్‌లోని నల్లపోచమ్మ,బొప్పన్ కట్టమైసమ్మ,తదితర ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే బం డారి లక్ష్మారెడ్డి చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం అమ్మవారి బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.అదే విధం గా ఉప్పల్ నల్లచెరువు వద్ద పోచమ్మ ఆలయం తదితర దేవాలయాల్లో కార్పొరేటర్ రజితా పరమేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీల సమస్యల పరిష్కారానికి పార్లమెంట్ ముట్టడి

కాచిగూడ, ఆగస్టు 4: కేంద్ర ప్రభుత్వం జనాభా దమాష ప్రకారం బీసీలకు రిజర్వేన్లు కల్పించడానికి పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో బీసీ సంఘాలు, కుల సంఘాల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సత్యం మాట్లాడుతూ.. బీసీ సమస్యల సాధనకై 5,6,7 తేదీల్లో గుజ్జ సత్యం ఆధ్వర్యంలో వేలాది మందితో పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు.. ముఖ్యఅతిథులుగా రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, వివిధ రాజకీయపార్టీల పార్లమెంట్ సభ్యులు, ప్రముఖులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమం లాగా బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి అసెంబ్లీ, చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నందగోపాల్, రామకృష్ణ, సురేశ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జ సత్యం